చట్టాలు కఠినంగా అమలు చేయాలి



వైద్య సిబ్బంది కోసం ప్రభుత్వాలు రక్షణ చట్టాలను కఠినంగా అమలు చేయాల్సిందే. పని ప్రదేశంలో హౌస్ సర్జన్‌లు, పీజీ విద్యార్థులు, డ్యూటీ డాక్టర్లకు విశ్రాంతి గదులు ఉండాలి. సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి. కొన్నిచోట్ల వైద్య సిబ్బంది 36 గంటల డ్యూటీ చేస్తున్నారు. 24 గంటల కంటే డ్యూటీ చేయడం కష్టం. ప్రధానంగా మహిళా ఉద్యోగులు పనిచేసే చోట మహిళా భద్రత సిబ్బందినే నియమించాలి. అప్పుడే మనిషికి మనిషి తోడులా ఉంటుంది.

– డాక్టర్ మట్టా శశి ప్రియాంక, ఆర్పీపేట యూపీహెచ్‌సీ

మహిళా వైద్యులకు భద్రత కల్పించాలి



ఆస్పత్రుల వద్ద మహిళా వైద్యులు, సిబ్బంది కోసం ప్రత్యేకంగా మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. విధుల్లో ఉన్న సమయంలో భద్రత కల్పించాలి. మురికివాడల్లో యూపీహెచ్‌సీలు ఏర్పాటు చేసినా సరైన రక్షణ ఉండడం లేదు. యూపీహెచ్‌సీల వద్ద సెక్యూరిటీ వ్యవస్థ ఏర్పాటు చేయాలి. అప్పుడే మహిళా వైద్యులు, సిబ్బంది ధైర్యంగా విధులు నిర్వర్తించగలరు. ఆ దిశగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి.

– శాంతి, ప్రధాన వైద్యాధికారి, భవానీ గార్డెన్స్ యూపీహెచ్‌సీ

క్లుప్తంగా

వీవీవైఎం నూతన కార్యవర్గం



వీవీవైఎం నూతన కార్యవర్గ సభ్యులు

మురళీనగర్ : విశాఖ వివేకానంద యువ మహా మండలి (వీవీవైఎం) నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసినట్లు మండలి ప్రతినిధి హృదయ్ తెలిపారు. అధ్యక్షుడిగా కవిటి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడిగా బాచిన శ్రీధర్, కార్యదర్శిగా చంద్రశేఖర్, సహాయ కార్యదర్శులుగా డీఎస్ మూర్తి, ఎ.శ్రీనివాస్, కోశాధికారిగా ఎం.పల్లా రావు, కార్యవర్గ సభ్యులుగా కె.హృదయ్, జోగారావు, నందమూరి, ఆర్.దేముడు నాయుడు, శాశ్వత ప్రతినిధిగా డి.వెంకటరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

శ్రీలలితాపీఠంలో చండీహోమం



చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

సీతంపేట : శ్రావణమాసం బహుళ అష్టమి సందర్భంగా శ్రీలలితాపీఠంలో విశేష పూజలు సోమవారం నిర్వహించారు. ఉదయం చండీ హోమం, సాయంత్రం కాల భైరవ హోమం నిర్వహించారు. పండితుల వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా హోమాలు జరిపించారు. అష్టమి రోహిణి నక్షత్రం సందర్భంగా మంగళవారం ఉదయం శ్రీరాధాకృష్ణులకు విశేష పూజలు నిర్వహిస్తామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

నూతన కార్యవర్గానికి అభినందనలు



నూతన కార్యవర్గ సభ్యులను సత్కరిస్తున్న నాయకులు

కంచరపాలెం : జీవీఎంసీ 48వ వార్డు ఇందిరా నగర్ – 5లో జరిగిన జై భారత్ యువజన సేవా సంఘం ఎన్నికల్లో విజయం సాధించిన నూతన కార్యవర్గ సభ్యులను వార్డు కార్పొరేటర్ గంకల కవిత సోమవారం అభినందించారు. ఈ మేరకు నూతన అధ్యక్షుడు రాజాన చిన్నబాబు, కార్యదర్శి కందికుప్ప త్రినాథ్, కోశాధికారి చల్లా లక్ష్మీపతిని గంకల అప్పారావు శాలువాతో సత్కరించారు. గ్రామాభివృద్ధికి సంఘాలు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. వార్డు అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

కూలేందుకు సిద్ధంగా ఎండిన చెట్టు



హైవేపై గ్రీన్‌బెల్ట్‌లో కూలడానికి సిద్ధంగా ఉన్న ఎండిన చెట్టు

సీతంపేట : జాతీయ రహదారిపై శంకర మఠం రోడ్ కూడలి వద్ద సాయికృష్ణ బార్ అండ్ రెస్టారెంట్ ముందున్న గ్రీన్ బెల్ట్ ప్రాంతంలో ఎండిన చెట్టు కూలడానికి సిద్ధంగా ఉంది. చెట్టు పూర్తిగా ఎండిపోయి గట్టిగా గాలి వీస్తే కూలేందుకు సిద్ధంగా ఉంది. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి చెట్ల కొమ్మలు విరిగి రోడ్డుపై పడ్డాయి. ఆ సమయంలో వాహనాల రాకపోకలు పెద్దగా లేకపోవడంతో ప్రమాదం తప్పింది. గట్టిగా గాలి వీసి చెట్టు కూలిపోతే ప్రమాదం సంభవించే అవకాశం ఉందని, సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఆక్రమణలో సర్వీస్ రోడ్లు

• రహదారిపైనే మెకానిక్ షెడ్ల నిర్వహణ • బడ్డీలు ఏర్పాటు చేసి వ్యాపార కేంద్రాలుగా వినియోగం • రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు



అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలో రోడ్‌కు ఇరువైపులా నిలిపిన వాహనాలు



గురుద్వారా కూడలి వద్ద సర్వీస్ రోడ్‌లో ఆటోలకు మరమ్మతులు చేస్తున్న మెకానిక్‌లు

సీతంపేట : జాతీయ రహదారికి సమాంతరంగా నిర్మించిన సర్వీస్ రోడ్లు ఆక్రమణకు గురయ్యాయి. అందరూ స్వేచ్ఛగా ప్రయాణించి సులువుగా గమ్యానికి చేరుకునేందుకు నిర్మించిన సర్వీస్ రోడ్లను కొందరు వాహనాల మరమ్మతులకు అడ్డాగా, మెకానిక్ షెడ్లుగా, వాహనాల పార్కింగ్ కేంద్రాలుగా, బడ్డీలు ఏర్పాటు చేసి వ్యాపార కేంద్రాలుగా మార్చేశారు. నగరంలో వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని జాతీయ రహదారికి సమాంతరంగా గతంలో సర్వీస్ రోడ్లు నిర్మించారు. హైవేకు సమీపంలో నివసించే వారు అనుబంధ రహదారుల్లో ప్రయాణించి గమ్యస్థానాలకు సులువుగా చేరుకునే వీలుంది. అలాగే ఆటోలు హైవేపై ప్రయాణించడానికి నిబంధనలు అడ్డుపడతాయి. వీరి కోసం సర్వీస్ రోడ్లు ఉపయోగపడుతుంటాయి. కానీ ఎంతో ముఖ్యమైన సర్వీస్ రోడ్లు కొందరి ఆక్రమణదారుల చెరలో చిక్కుకున్నాయి. ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి కొనసాగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అద్దె లేని వ్యాపార కేంద్రాలుగా రోడ్లు

జీవీఎంసీ 25, 26, 44, 14, 45 వార్డుల పరిధిలో సీతంపేట గణేష్‌నగర్, గురుద్వారా, శాంతిపురం, అక్కయ్యపాలెం, ఎన్జీజీవోస్ కాలనీ, అబిద్‌నగర్, నరసింహనగర్ ప్రాంతాల్లో సర్వీస్ రోడ్లు పూర్తిగా ఆక్రమణకు గురయ్యాయి. సత్యం సెంటర్ నుంచి పోర్టు ఆస్పత్రి జంక్షన్ వరకు హైవేకు సమాంతరంగా సర్వీస్ రోడ్ ఉంది. సత్యం సెంటర్ నుంచి గురుద్వారా రావాలన్నా, గణేష్‌నగర్, సీతంపేట, కనకమ్మ వీధి, రెల్లివీధి ప్రాంతాల వారు హైవే పైకి రాకుండా సర్వీస్ రోడ్డుపై ప్రయాణించవచ్చు.



సీతంపేట గణేష్‌నగర్ సర్వీస్ రోడ్‌లో మరమ్మతుల కోసం నిలిపిన వాహనాలు

అయితే ఈ సర్వీస్ రోడ్డును ఆటోల మరమ్మతులు, కార్ల టింకరింగ్, పెయింటింగ్ పనులు చేసే వారు తమ అడ్డాగా మార్చేసుకున్నారు. నెలల తరబడి వాహనాలను రోడ్డుపై నిలిపి మరమ్మతులు, టింకరింగ్, పెయింటింగ్ పనులు నిర్వహిస్తున్నారు. సర్వీస్ రోడ్డుపై నిరంతరం ఆటోలు, కార్ల మరమ్మతులు జరుగుతుంటాయి. పది మంది ప్రయాణించడానికి ఉపయోగపడాల్సిన సర్వీస్ రోడ్లు కొంత మంది స్వార్థ ప్రయోజనాలకు పరిమితం కావడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. దీంతో కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన రహదారులు ఆక్రమణదారులకు ఆవాసాలుగా మారి అద్దె చెల్లించనక్కర లేని వ్యాపార కేంద్రాలుగా ఉపయోగపడుతున్నాయి. అలాగే అక్కయ్యపాలెం హైవే కూడలి వద్ద నరసింహనగర్ రైతుబజార్ రోడ్‌కు ఆనుకొని ఉన్న సర్వీస్ రోడ్‌ను భారీ వాహనాల పార్కింగ్‌కు ఉపయోగిస్తున్నారు. అక్కయ్యపాలెం మెయిన్ రోడ్ వైపు ఉన్న సర్వీస్ రోడ్ కూడా ఆటోల పార్కింగ్‌తో ప్రయాణానికి వీలు లేకుండా పోయింది. టౌన్‌ప్లానింగ్, ట్రాఫిక్ పోలీసులు డ్రైవ్ చేపట్టి సర్వీస్ రోడ్లపై ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

సర్వీస్ రోడ్‌లో ప్రయాణం కష్టం



సర్వీస్ రోడ్లు పూర్తిగా ఆక్రమణకు గురయ్యాయి. వాహనాల రాకపోకలకు వీలు లేకుండా కార్లు, ఆటోలు మరమ్మతుల షెడ్లుగా వినియోగిస్తున్నారు. రోడ్లను ఆక్రమించి మెకానిక్ షెడ్లు, టింకరింగ్, పెయింటింగ్ పనులు నిర్వహిస్తూ రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్నారు. సర్వీస్ రోడ్‌ను ఆక్రమించి కార్లు, బస్సులు, లారీలు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో సర్వీస్ రోడ్‌లో ప్రయాణించడానికి ఇబ్బంది పడుతున్నాం. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలి.

– కింతాడ శ్రీను, అక్కయ్యపాలెం

ఆక్రమణలు తొలగించాలి



జాతీయ రహదారిపై వాహనాల రద్దీ నానాటికీ పెరిగిపోతోంది. ఉదయం ఆఫీసులు, స్కూళ్లకు వెళ్లేవారితో, వ్యాపారాలు తెరుచుకునే సమయంలో, తిరిగి సాయంత్రం వేళల్లో రద్దీ మరింత ఎక్కువగా ఉంటోంది. ఆయా సమయంలో రాకపోకలు సాగించేందుకు హైవేకు ప్రత్యామ్నాయంగా సర్వీస్ రోడ్లు ఉపయోగపడుతున్నాయి. అటువంటి రహదారుల్లో ఆటంకాలు లేకుండా ప్రయాణించేలా ట్రాఫిక్ పోలీసులు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది చర్యలు చేపట్టాలి.

– వెంకటరమణ, సీతంపేట

భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలి



సీతమ్మధారలో ర్యాలీలో ఏఐటీయూసీ నాయకులు

సీతమ్మధార : ఇసుక, సిమెంట్, ఐరన్ ధరలు తగ్గించి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. భవన నిర్మాణ సామగ్రి ధరలు తగ్గించాలని, సెప్టెంబర్ 3న విశాఖలో నిర్వహించే కార్మిక ప్రదర్శన, బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం సీతమ్మధార అల్లూరి సీతారామరాజు జంక్షన్ వద్ద ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను వెంటనే ఆపాలన్నారు. ప్రభుత్వాలు కార్మికులకు రోజుల తరబడి ఉపాధి లేకుండా చేస్తున్నాయని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం భారీగా పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి కార్మికుల కుటుంబాలను ఆదుకోకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కె.శంకర్, ఎస్.పాపారావు, పి.గణపతి, జి.సత్యం, డి.రాము తదితరులు పాల్గొన్నారు.

వైభవుని సన్నిధిలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు నేడు

మురళీనగర్: కప్పరాడ ఎన్జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు మంగళవారం సాయంత్రం నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు వైభవుడికి అర్చనలు, మంగళా శాసనములు, తీర్థ ప్రసాద గోష్టి నిర్వహిస్తామని, సాయంత్రం 7 గంటలకు ఉట్టి కొట్టే మహోత్సవం నిర్వహిస్తామని తెలిపారు.

కృష్ణం వందే ప్రేమస్వరూపమ్



గోపిక శ్రీకృష్ణ వేషధారణలో చిన్నారులు

శ్రీకృష్ణ జన్మాష్టమి.. కులమత భేదం లేకుండా ప్రతి తల్లీ తన బిడ్డను గోపిక, బాలకృష్ణుల వేషధారణలో చూసుకుని మురిసిపోయే రోజు. ఆడపిల్లలను కూడా చిన్ని కృష్ణుడిగా అలంకరించి, ఫొటోలు తీయించి, దాచుకునే సమయం. సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి కావడంతో వెన్నమీగడల ప్రసాదాలు, ఉట్టి సంబరాలతో నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో ఉత్సాహం ఉరకలెత్తింది. శ్రీకృష్ణ మందిరాలు, వైష్ణవాలయాల్లో ఉదయం నుంచీ దేవకీ సుతుని నామ సంకీర్తనలు మార్మోగాయి. ప్రతి వీధిలో ఉట్టి ఉత్సవంలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.



మురళీనగర్ వైశాఖి స్పోర్ట్సు పార్కులో గోపికలు, శ్రీకృష్ణుని వేషధారణలో చిన్నారులు



బాపూజీనగర్‌లో వేషధారణలో చిన్నారులు



జీవీఎంసీ 24వ వార్డులో కృష్ణాష్టమి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్న భక్తులు



రైల్వే న్యూకాలనీలో కృష్ణాష్టమి పూజల్లో డీఆర్‌ఎం సారభ్‌ప్రసాద్, తదితరులు

- ఉత్సాహంగా కృష్ణాష్టమి వేడుకలు
- చిన్ని కృష్ణుల చిందులతో ఝల్లుమన్న గుండెలు
- శ్రీకృష్ణుడి నామ సంకీర్తనతో మార్మోగిన ఆలయాలు

తాటిచెట్లపాలెం : యదువంశీ రైల్వే ఎంప్లాయిస్ స్పిరిట్యువల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం రైల్వే న్యూ కాలనీలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా దొండపర్తి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జంక్షన్ నుంచి సుబ్బలక్ష్మి కల్యాణ మండపం వరకు గుర్రపు బగ్గీపై చిన్ని కృష్ణుడిని ఊరేగించారు. అనంతరం వేదిక వద్ద కోలాటం, సాముగరిడీ, గరుడ సేవ, ఉట్టి కొట్టే కార్యక్రమాలు నిర్వహించారు. డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్, కోచింగ్ డిపో ఆఫీసర్ భరత్ కృష్ణ, గతిశక్తి ఏఎస్‌టీఈ ప్రవీణ్ కుమార్ యాదవ్, ఏపీవో డీవీ అప్పారావు, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి దంపతులు, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, రైల్వే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రాధాకృష్ణులకు ప్రత్యేక పూజలు

సీతంపేట : స్థానిక రాధాకృష్ణ ఆలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి పంచామృతాభిషేకం, మంత్రపుష్పాలతో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం కల్పించారు. పరిసర ప్రాంత భక్తులు స్వామిని దర్శించుకుని అభిషేకాలు చేశారు. ఎమ్మెల్యే పెనుమత్స విష్ణుకుమార్ రాజు ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. సాయంత్రం పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించి ఉట్టికొట్టే కార్యక్రమాన్ని కోలాహలంగా జరిపారు. పూజల్లో ఇసరపు వెంకటలక్ష్మి, వాసు, ఇసరపు అప్పారావు, స్థానికులు పాల్గొన్నారు.

కంచరపాలెం : కంచరపాలెం పరిధి జాషువానగర్, గోకుల్‌నగర్, బర్మాక్యాంప్, ఇందిరానగర్, 104 ఏరియా బాపూజీనగర్, ఐటీఐ కూడలి, ఊర్వశి జంక్షన్ ప్రాంతాల్లోని శ్రీకృష్ణ మందిరాల్లో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామికి విశేష పూజలు చేశారు. జాషువానగర్‌లో ఏర్పాటు చేసిన వేడుకల్లో ఐఎన్‌టీయూసీ నాయకుడు గుమ్మిడి ఆదినారాయణ ప్రత్యేక పూజలు చేశారు. బాపూజీనగర్‌లో శ్రీకృష్ణుని పూజల్లో చిన్నారులు ఆకట్టుకున్నారు.

• గొల్ల కంచరపాలెంలోని శ్రీకృష్ణ మందిరంలో శ్రీరామా సేవా సమాజం(యాదవ్), శ్రీకృష్ణ కమిటీ సంయుక్తంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు స్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేలు పి.గణబాబు, పి.విష్ణుకుమార్‌రాజు, సీహెచ్ వంశీకృష్ణ యాదవ్ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో శ్రీకృష్ణ వేషధారణ పోటీలు, ఉట్టు కొట్టే సంబరాలు నిర్వహించారు.

మద్దిపాలెం : జీవీఎంసీ 51వ వార్డు విద్యానగర్ ఎంఎస్‌ఆర్ పార్కులో మాధవనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు సోమవారం సాయంత్రం సందడిగా నిర్వహించారు. కార్పొరేటర్, ఎంఎస్‌ఆర్ పార్కు అధ్యక్షుడు వావిలపల్లి ప్రసాద్, చౌదరి అప్పారావు హాజరై ముందుగా శ్రీకృష్ణుడి విగ్రహానికి పూలమాలలు వేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉట్టి కొట్టడం, చిన్నారుల ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు, నృత్య ప్రదర్శన, పాటల పోటీలు నిర్వహించారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ అన్నెపు నారాయణరావు, గౌరవ కార్యదర్శి శ్రీను పాల్గొన్నారు.

• జీవీఎంసీ 53వ వార్డు జాతీయ రహదారి పంజాబ్ హోటల్ జంక్షన్ సమీపంలో కొలువైన శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని గోశాలలో ఏర్పాటు చేసిన శ్రీ కృష్ణుడి విగ్రహానికి అర్చకుడు లలితా వరాహగిరి ఆధ్వర్యంలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. కృష్ణ సంకీర్తన, కోలాటం, గోపూజ చేశారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొనడంతో ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది.

మురళీనగర్ : మురళీనగర్ వైశాఖి స్పోర్ట్సు పార్కులో శ్రీకృష్ణాష్టమి వేడుకలు సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. పార్కు అధ్యక్షుడు ససపల వరప్రసాద్ పర్యవేక్షణలో గోపికలతో శ్రీకృష్ణుడి నృత్య పదర్శనలు, చిన్నారుల ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. ఉట్టి కొట్టే ఉత్సవంలో మురళీనగర్ పరిసర ప్రాంత ప్రజలు, వాకర్స్, పార్కు సందర్శకులు పాల్గొన్నారు.

• మురళీనగర్ సమీపంలోని పట్టాభిరెడ్డితోట వానప్రస్థ వృద్ధాశ్రమంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. నిర్వాహకుడు రొబ్బి శ్రీనివాసు ఆధ్వర్యంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులు శ్రీకృష్ణుడికి, గోమాతకు పూజలు చేశారు. విష్ణు సహస్రనామార్చన చేశారు.

సీతమ్మధార : సీతమ్మధారలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ బలరామ గోపిక వేషధారణలో చిన్నారులు ఉత్సహంగా పాల్గొన్నారు. గోపిక వేషాధారణలో నృత్యం చేస్తూ చిన్నారులు ఆకట్టుకున్నారు.

• జీవీఎంసీ 24 వార్డులోని శ్రీ ఊమానీలకంఠేశ్వర స్వామి ఆలయం ఎదురు రోడ్డులో లక్కీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గుప్తాజీ, బర్ల బాలకృష్ణ, జి.రమణ, మురళి, ఈశ్వర్, అనిల్, పండు, పవన్, జేకే రాజు పాల్గొన్నారు.



జాషువానగర్‌లో ప్రత్యేక పూజల్లో భక్తులు



సీతంపేటలో రాధాకృష్ణ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు



ఉట్టి లాగుతున్న కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, తదితరులు

19 కేజీల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం : అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరిని విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 19 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో రైల్వే భద్రతా దళం సబ్ ఇన్‌స్పెక్టర్ వి.కీర్తి రెడ్డి సిబ్బందితో సోమవారం తనిఖీలు చేశారు. ఆ సమయంలో ఢిల్లీకి చెందిన షాకిబ్ ఆలీ, ముంబయికి చెందిన శంకర్ తెవతియా బిశ్వాల్ వద్ద గంజాయి గుర్తించారు. వారు విశాఖపట్నం రైల్వే స్టేషన్ మీదుగా ఢిల్లీ, ముంబయికి గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని 19 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని జీఆర్పీ ఎస్‌ఐ ఎస్.రామారావుకు అప్పగించారు. వీరిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు సిబ్బంది తెలిపారు.

మహిళలకు ముగ్గుల పోటీలు

మురళీనగర్ : పర్యావరణ పరిరక్షణలో భాగంగా గ్రీన్ క్లైమేట్ టీమ్ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం ఆధ్వర్యంలో మురళీనగర్ సెక్టార్ – 8లోని హరిత పార్కులో ఆదివారం సాయంత్రం మహిళలకు బియ్యంతో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్, మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభావతి, గౌరీ సంఘం అధ్యక్షురాలు ఝాన్సీ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. అన్నపూర్ణ, దీపాశిఖ, ఎ.లక్ష్మి మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు పార్కు అధ్యక్ష, కార్యదర్శులు పి.కొండలరావు, దేముడు బాబు బహుమతులు అందించారు. కార్యక్రమంలో అరవల అరుణ, మళ్ల సరిత, నాదెళ్ల జ్యోతి, రమా దేవి, జె.రవితేజ, ఇ.కృష్ణకుమారి పాల్గొన్నారు.